క్లుప్తంగా

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

మదనపల్లె సిటీ: స్థానిక వలసపల్లె వద్దనున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతుల్లో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 7వతేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బూత్ కమిటీ మండల అధ్యక్షుడి నియామకం


చాంద్‌బాషా

ములకలచెరువు: మండల బూతు కమిటీ అధ్యక్షుడిగా ములకలచెరువుకు చెందిన బోణాల చాంద్‌బాషా నియమితులయ్యారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. తనపై నమ్మకంతో బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమించడానికి ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చాంద్‌బాషా అన్నారు.

మైనర్లు వాహనాలు నడపడం ప్రమాదకరం

మదనపల్లె రూరల్: మైనర్లు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర అన్నారు మంగళవారం డ్రైవింగ్ చేస్తున్న 50 మంది మైనర్ విద్యార్థులను గుర్తించి వారి ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని, రహదారి నియమాలు పాటించాలన్నారు కార్యక్రమంలో వన్‌టౌన్ టు టౌన్ సీఐలు రఫీ, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లపై సదస్సు

మదనపల్లె రూరల్ : విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే), భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) సంయుక్త నిర్వహణలో బుధవారం రాజ్యాంగం– రాజకీయ హక్కులు– ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బాస్ అధ్యక్షులు పీటీయం. శివప్రసాద్ తెలిపారు. మంగళవారం బాస్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో బుధవారం పట్టణంలోని కదిరిరోడ్డు సూర్యటవర్స్ కాన్ఫరెన్స్‌హాల్‌లో అవగాహన శిబిరం ఉంటుందన్నారు. వీసీకే, బాస్ నాయకులతో పాటు విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత రమణ మృతికి సంతాపం

బి.కొత్తకోట: మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, టెలికాం అడ్వయిజరీ కమిటీ మాజీ సభ్యులు ఈ.వెంకటరమణ (75) మంగళవారం మృతి చెందాడు. గుమ్మసముద్రం పంచాయతీ బుచ్చిరెడ్డిగారిపల్లెకు చెందిన రమణ అచ్చు డాక్టర్‌గా అందరికి చిరపరిచితులు. ఆయన 30ఏళ్లకుపైగా కాంగ్రెస్‌పార్టీలో పనిచేసి వైఎస్సార్‌సీపీలోకి వచ్చారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సీపీ.సుబ్బారెడ్డి తదితరులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తంబళ్లపల్లె: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని కన్నెమడుగు,రెడ్డివారిపల్లె పోషణ మాసోత్సవాలు కార్యక్రమం జరిగింది. బాలింతలు, గర్భవతులు పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు,కోడిగుడ్లు తీసుకోవాలన్నారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ పూర్తిచేయాలి

మదనపల్లె రూరల్ : ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను సెప్టెంబర్ నెలాఖరులోపు రేషన్‌కార్డుదారులకు అందజేయాలని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి రేషన్ డీలర్లను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...మదనపల్లె మండలానికి సంబంధించి 62,908 స్మార్ట్ రేషన్‌కార్డులు రావడం జరిగిందన్నారు. వీటిని రేషన్ షాపుల డీలర్ల నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకుని అందజేసి పంపిణీ చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. స్మార్ట్‌కార్డులు ఇప్పటివరకు తీసుకోని వారు త్వరగా డీలర్ల వద్దకు వెళ్లి తీసుకోవాలని కోరారు.

సమాజసేవ ఆదర్శనీయం

బి.కొత్తకోట: సమాజానికి సేవ చేయాలన్న ఆశయం అభినందనీయమని స్థానిక సీఐ కే.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం భరత్ హైస్కూల్‌లో మదనపల్లె హెల్పింగ్‌మైండ్స్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ మైండ్స్ చేస్తున్న సేవలను కొనియాడారు. వీరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరైన 110 మందికి పరీక్షలు నిర్వహించగా 40 మందికి కంటి ఆపరేషన్లను ఎంపిక చేశారు.


శోభాయమానంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- అలంకారాల్లో ఆకట్టుకుంటున్న అమ్మవార్లు
- ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం


గుర్రంకొండ: రెడ్డెమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మదనపల్లె: పసుపు అలంకారంలో చౌడేశ్వరిదేవి అమ్మవారు


మదనపల్లె: కుంకుమ అలంకారంలో కోర్టులో గంగమ్మ


రామసముద్రం: పసుపు అలంకారంలో శ్రీ పటాలమ్మ


పీలేరు : గాయత్రీదేవి అలంకరణలో అంకాలమ్మ


కలికిరి: గాయత్రీదేవి అలంకారంలో ఎల్లమ్మతల్లి


కేవీపల్లె : గాయత్రీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి

మదనపల్లె సిటీ: పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శోభయమానంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన మంగళవారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారి అలంకారాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం సుప్రభాతం, అభిషేకం,హోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఈశ్వరమ్మకాలనీ, శాస్త్రీవీధి, కమ్మవీధి నుంచి మహిళలు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాయంత్రం అమ్మవారు గాయిత్రీ దేవి అలంకారంలో దర్శనం కల్పించారు. వాసవీ ఉమెన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యుల్లత వాసవీదేవిని కొలుచుకుందాం అంటూ మహిళలు ప్రత్యేక పాటలు ఆలపించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి సతీష్, గిరిధర్, రాజేష్, క్రిష్ణరావు తదితరులు పాల్గొన్నారు.స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని పసుపు అలంకారం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం ప్రత్యేక పూజలు,హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీటీఎం రోడ్డులోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మి అలంకారం, కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ కుంకుమ అలంకారం చేశారు. స్థానిక కమ్మగడ్డవీధిలో దుర్గామాతను అరుణ్‌తేజ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. దుర్గామాతను స్థానికులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలోని పలు ఆలయాల్లో మంగళవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాలీశ్వర స్వామి కొండపై వెలసిన శ్రీ పార్వతి దేవి, లక్ష్మీ జనార్ధన స్వామి, తిరుమల రెడ్డిపల్లిలోని మారెమ్మ, గుంతయంబాడిలోని శ్రీ చౌడేశ్వరి దేవి, మూగ ఎర్రప్పల్లిలో శ్రీ పటాలమ్మ తదితర ఆలయాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన చేశారు.

గాయత్రీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెడ్డెమ్మతల్లితో పాటు గుర్రంకొండ గ్రామ దేవతలైన గంగమ్మ, పోలేరమ్మ, కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు గాయత్రీ దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను రంగు రంగుల పుష్పాలతో, పట్టుచీరెలు, దివ్యాభరణాలతో అలంకరించారు. చక్కెర పొంగలి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గాయత్రీదేవి అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే స్థానిక నెహ్రూ బజార్‌లో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపర మేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నపూర్ణాదేవిగా ఎల్లమ్మ తల్లి

కలికిరి: దసరా ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ మంగళవారం భక్తులను గాయత్రీదేవి అలంకారంలో కటాక్షించారు. నవరాత్రి ఉత్సవాలలో రెండవ రోజు ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజల అనంతరం విశేష అలంకరణ చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పార్వతీ సమేవత సోమేశ్వర స్వామి ఆలయంలో సప్తమాత్రుక మహిషాసుర మర్ధిని దేవికి పూజలు, విశేష అలంకరణ నిర్వహించారు. సాయంత్రం మహిళలు పాల్గొని లలిత సహస్ర కుంకుమార్చన చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గాయత్రీదేవిగా చౌడేశ్వరిదేవి

కేవీపల్లె : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలో వెలసిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని నిర్వాహకులు గాయిత్రీ దేవి అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు ప్రదానం చేశారు.

ఆధారాలు లేకున్నా మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు

- కేసు నిలవదని తెలిసినా వేధిస్తున్న చంద్రబాబు
- ఎంపీ మిథున్‌రెడ్డిని ములాఖత్‌లో కలిసిన సమన్వయకర్త నిసార్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి


మిథున్‌రెడ్డితో ములాఖత్ అనంతరం బయటకు వస్తున్న నిసార్, నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని వేధించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం కక్షతో వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ, అనంతపురం వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంగళవారం వారు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ములాఖత్ ద్వారా మిథున్‌రెడ్డిని కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిథున్‌రెడ్డి ఎదుగులను ఓర్వలేక చంద్రబాబు కుట్రలకు పాల్పడి మద్యం అక్రమ కేసులో అరెస్ట్ చేయించారన్నారు. ఈ కేసులో లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఢిల్లీకంటే ఏపీ లిక్కర్ స్కాం పెద్దదని తప్పుడు ప్రచారం చేస్తూ..తొలుత రూ.30వేల కోట్లు, తర్వాత రూ.10వేల కోట్లు, ఇప్పుడేమో రూ.3 వేల కోట్లు అంటూ లిక్కర్ కేసుపై ఇష్టమొచ్చినట్టు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాయలసీమలో మిథున్ రెడ్డి ప్రాభవాన్ని తగ్గించేందుకు ఇలా అక్రమ కేసులో అరెస్ట్‌చేసి వేధిస్తున్నారన్నారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయ ప్రమాద ఘటనలో ఎలాంటి ప్రమేయం లేకపోయినా ఆరోపణలతో ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నించి విఫలమైనట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేసేందుకు పోటీపడాలేకాని వేధింపులకు కాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ, అనంతపురం పార్లమెంటు కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించి వేధించి మానసికంగా వేధించాలన్న ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తప్పుడు కేసుల్లో బలంలేకపోయినా వ్యక్తిగతంగా ప్రజల్లో మిథున్‌రెడ్డికి ఉన్న బలాన్ని తగ్గించే ప్రయత్నమని అన్నారు. రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలపైనా అక్రమకేసులను నమోదు చేస్తూ వేధిస్తున్నారన్నారు.

ఉద్యమ రణభేరి విజయవంతం చేయాలి

మదనపల్లె సిటీ: ఉద్యమ రణభేరిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో యూటీఎఫ్ ఉద్యమభేరిపై సమావేశం జరిగింది. ఈనెల 25న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన భవనంలో రణభేరి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగాలన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర భారం తొలగించాలన్నారు. ప్లటూ హైస్కూల్స్ కొనసాగింపుపై స్పష్టత ఇవ్వాలని, మోడల్ స్కూల్స్ టీచర్ల సర్వీసు రూల్స్ ప్రకటించాలన్నారు. రిటైరు అయిన ఉద్యోగుల గ్రాట్యూటీ,ఎరండ్ లీవ్,ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ పురం రమణ,నాయకులు సుధాకర్, వెంకటయ్య, శ్రీనివాసులు, విజయకుమార్, ఎస్‌హెచ్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా విచారణ చేస్తున్నారు

- సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలి
- వెలుగు అకౌంటెంట్ సాయిలీలా ఆవేదన

ములకలచెరువు: వెలుగు అకౌంటెంట్ నిధులు దుర్వినియోగం చేసినట్లు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు అందడంతో ఎంపీడీఓ హరినారాయణ సోమవారం వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై అకౌంటెంట్ సాయిలీలా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలానికి చెందిన పలువురు సంఘమిత్రల పద్ధతి బాగలేకపోవడంతో వారి తీరు మార్చుకోవాలని చెప్పడంతో తనపై కక్ష కట్టి బయటి వ్యక్తులతో ఆరోపణలు చేయిస్తున్నారని ఆమె తెలిపారు. తనను అధికారులు ఇంతవరకు విచారించలేదని, ఏకపక్షంగా విచారణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ములకలచెరువు వీవీ 1, వీవో 7, పెద్దపాళ్యం వీవో 1 లోని మహిళలను, సంఘమిత్రలను విచారిస్తే అసలు కథ బయటపడుతుందని అకౌంటెంట్ చెప్పారు. అలాగే మండలంలోని బురకాయలకోట, పెద్దపాళ్యం, ములకలచెరువులకు చెందిన పలువురు సంఘమిత్రలు సైతం పొదుపు సంఘాలు, స్త్రీ నిధిలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

కౌన్సిల్ మీట్ నిర్వహణపై ఉత్కంఠ

మదనపల్లె: మదనపల్లె మున్సిపాలిటీలో సెప్టెంబర్‌లో జరగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం ఉంటుందా, ఉండదా అన్న చర్చ మొదలైంది. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పుడు మండల పరిషత్ లేదా మున్సిపల్, ఇతరా అధికారిక సమావేశాల నిర్వహణ ఉండదు. అయితే వీటి నిర్వహణలేని రోజుల్లో సమావేశాలను నిర్వహించుకోవచ్చు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిపోనున్నాయి. తర్వాత వరుసగా నాలుగైదురోజుల్లో కౌన్సిల్ మీట్‌ను నిర్వహించుకోవచ్చు. అయితే ఈనెల 16న అధికారులు నిర్వహించతలపెట్టిన కౌన్సిల్‌మీట్‌కు చైర్మన్ వి.మనూజ అమోదం ఇవ్వకపోవడంతో ఆగిపోయింది. అజెండాలో అధికారులు పెట్టిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కౌన్సిల్‌కు, తనకు సమాచారం ఇవ్వకపోవడం, అభిప్రాయాలైన తీసుకోకుండా అవమానించారంటూ చైర్మన్ ఆగ్రహంగా ఉన్నారు. వెలుగులోకి రాని ఈ విషయాన్ని సాక్షి మంగళవారం మదనపల్లె మున్సిపాలిటిలో పచ్చ అజెండా శీర్షికన ప్రచురించిన కథనంతో అందరికి తెలిసిపోయింది. దీనిపై కౌన్సిలర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈనెలాఖరులోగా కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించాలి. అయితే దీనిపై అధికారులు, కౌన్సిలర్లు, చైర్మన్ మధ్య ఇంకా ఎలాంటి చర్చలు సాగకపోవడంతో ఉత్కంఠగా మారింది.

హుండీ ఆదాయం లెక్కింపు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ద్వారా రూ. 1,82,701 ఆదాయం సమకూరింది. ఒకనెల పదిరోజులకు సంబంధించి హుండీ ఆదాయాన్ని మంగళవారం స్థానిక ఆలయంలో లెక్కించారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఆలయ ఈఓ మంజుల పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి దేవదాయశాఖ అధికారి శశికుమార్, సిబ్బంది బాలకృష్ణ, మహేష్, వెంకటరమణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శడిపోగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ: మదనపల్లె–1 ఆర్టీసీ డిపోను ఆదర్శడిపోగా తీర్చిదిద్దాలని డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపో ఆవరణంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో ఆదాయం, కెఎంపిఎల్‌లలో రీజియన్‌లో మొదటి స్థానం ఉందన్నారు. స్త్రీశక్తి పథకంలో మహిళలు ఆధార్, ఓటరు కార్డు, రేషన్‌కార్డు చూపిస్తే అనుమతించాలన్నారు. కార్డు లేకపోయినా ఫోన్‌లో ఉన్నా మొదటిసారి అనుమతించాలన్నారు. ఈ పథకంపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని వీటిని జాగ్రత్తగా చూడాలన్నారు. ప్రయాణికులతో సఖ్యతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్ రవి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం


జనార్దన్ (ఫైల్)

ములకలచెరువు: గూడుపల్లె వీఆర్‌ఏ జనార్దన్ (34) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. మృతుడి భార్య శ్రీవాణి 2017లో మృతిచెందింది. జనార్దన్ మృతదేహాన్ని సందర్శించి తహసీల్దార్ ప్రదీప్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుడిపై చర్యలకు డిమాండ్

పీలేరు : పుంగనూరు భాష్యం పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ డిమాండ్ చేశారు. బాష్యం పాఠశాలలో విద్యార్థిని సాత్విక నాగశ్రీని హోమ్ వర్క్ చేయలేదనే కారణంతో తలకు గాయం కలిగించిన ఉపాధ్యాయుడు, హెచ్‌ఎంలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్‌తో మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ధర్నా చేశారు. విద్యార్థిని ఆస్పత్రి ఖర్చులు పాఠశాల యాజమాన్యమే భరించాలన్నారు. విద్యార్థిని కుటుంబానికి ఆర్థియసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు సాయిసంపత్‌కుమార్, నాయకులు లోకేష్, యశ్వంత్, రాజేష్, కార్తీక్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో సెమినార్ నిర్వహించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివిన వారికి డిఆర్‌డిఓ,భార్క్, ఇస్రోలలో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. రోబోటిక్స్ అవశ్యకత, నేటి సమాజంలో ఎంతో ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కలికిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాలలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం ఆపదలో మరొకరి ప్రాణం కాపాడుతుందని, ఎలాంటి అపోహలకు తావువివ్వకుండా ఆరోగ్యవంతులు ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చన్నారు. 120 రక్తదానం చేశారు.

వైభవంగా పవిత్ర ఉత్సవాలు


తరిగొండ ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి పవిత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పవిత్ర ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. మొదటిరోజు మంగళవారం టీటీడీ వారి ఆధ్వర్యంలో పవిత్ర ప్రతిష్ఠ, వాసుదేవ ఆరాధన, కలశస్థాపన, శాంతి హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రంగులరంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని ఆకట్టుకొంది. అనంతరం స్నపన తిరుమంజనం కావించారు. పలు రకాల నైవేద్యాలను స్వామివారికి సమర్పించారు. ఉత్సవాలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

కోళ్లఫారం తరలింపునకు అంగీకారం


వడ్డిపల్లెలో విచారణ చేస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ వడ్డిపల్లె సమీపంలోని కోళ్లఫారంను 15రోజుల్లోపు అక్కడి నుంచి తరలించేందుకు యజమాని అంగీకరించినట్లు ఎంపీడీఓ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఎనుగొండవారిపల్లె, పిట్టావాండ్లపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల్లో కోళ్లఫారం కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... కోళ్లఫారం కారణంగా గ్రామాల్లో ఈగల బెడద అధికమై, పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్నభోజనం తినలేకపోతున్నారని, ఇంట్లోని ఆహారపదార్థాలపై ఈగలు వాలుతూ అపరిశుభ్రం చేస్తున్నాయని స్థానికులు కొద్దిరోజుల క్రితం తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై కోళ్లఫారం తనిఖీ చేసి యజమానిని పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పంచాయతీ ద్వారా రెండుసార్లు నోటీసులు అందజేశామన్నారు. ఈ విషయమై మంగళవారం గ్రామంలో బహిరంగ విచారణ చేశామన్నారు. గ్రామస్తుల అభ్యర్థనతో కోళ్లఫారం తరలించాలని ఆదేశించామన్నారు. దీనికి కోళ్ల ఫారం యజమాని ప్రస్తుతం 12,000 కోళ్లు షెడ్‌లలో ఉన్నాయని, 15రోజులు గడువు కావాల్సిందిగా కోరారన్నారు. నిర్దేశించిన సమయంలోగా కోళ్లఫారం తరలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, పంచాయతీ కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.